క్లుప్తంగా

ఘనంగా ఉజ్జయినీ మహంకాళి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో హోమం చేస్తున్న సర్పంచ్ దంపతులు

సామర్లకోట: మండలం నవర గ్రామంలో సుమారు రూ.70 లక్షలతో గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు దమ్మాల లక్ష్మణ రావు, వీరనాగమణి దంపతులు నిర్మించిన ఆలయంలో బుధవారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. నవరత్న న్యాసం, నవధాన్య న్యాసం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు వింజమూరి సత్యనారాయణ మూర్తి, దమ్మాల లక్ష్మణరావు, వీరనాగమణి దంపతులచే కార్యక్రమాలు చేయించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
అమ్మవారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు బుధవారం దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు దవులూరి సుబ్బారావు, నాగనబోయిన రాజబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో సామర్లకోట యువకుడి మృతి



బషీరుద్దీన్ (ఫైల్)

సామర్లకోట: విశాఖపట్నంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సామర్లకోట, భాస్కర్ నగర్‌కు చెందిన షేక్ ఖాజా బషీరుద్దీన్ (24) మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం బషీరుద్దీన్ విశాఖలో ఒక ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడు. అతనిని చూడటానికి సామర్లకోట భాస్కర్‌నగర్‌లో నివసిస్తున్న తల్లిదండ్రులు మంగళవారం విశాఖ వెళ్లారు. వారిని బీచ్‌కు తీసుకువెళ్లేందుకు స్కూటీపై వెళ్తుండగా కాన్వెంట్ జంక్షన్‌లో లారీ ఢీకొని తల మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తండ్రి రహీమ్ తెలిపారు. తమను సంతోషపెట్టాలని చూసిన కుమారుడు వేదన మిగిల్చాడని వారు కన్నీరు మున్నీరయ్యారు. విశాఖ పోలీసులు కేసు నమోదు చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

పెద్దాపురం: రబీ సీజన్‌లో రైతులకు అందుబాటులో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి కోరారు. స్థానిక ఆర్బీకే వద్ద బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం ఆరబెట్టుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ప్రసాద్, బి.రాగస్రవంతి, విష్ణు, రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కలెక్టర్ పర్యటన



పనులను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో కలెక్టర్ షణ్మోహన్ బుధవారం పర్యటించారు. ఉప్పాడలోని చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో నిర్మించనున్న కల్యాణ మండప శంకుస్థాపనకు శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రానున్నారు. దేవదాయ, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ మండపాన్ని పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఆయనతో పాటు జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పలు శాఖల అధికారులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ రాహుల్ మీనా అన్నారు. మండలంలోని ఎండపల్లి, నాగులాపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ధాన్యం కళ్లాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22శాతం తేమ ఉన్న ధాన్యాన్ని రైతుల అంగీకారంతో కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. ఒక శాతం తేమకు క్వింటాకు కిలో తరుగు ఇవ్వవలసిందిగా తెలియజేశారు.

పది మంది మెచ్చుకునేలా...!

- పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ
- జిల్లా పది మంది టాపర్లలో ఐదుగురు పిఠాపురం విద్యార్థులే



వేట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు



తోట పుష్పాంజలి



ఆకేటి కనకవల్లి



ఎం శ్రీకీర్తన



జి మహాలక్ష్మి



రాయి భూయిల ప్రియాంక



బి తనుశ్రీ



వై అనూష



ఎస్‌జెఎస్ఎస్ భార్గవ్



బెజవాడ నాగహారిక



కసిరెడ్డి గాయత్రి



జి.శ్రీవల్లి

పిఠాపురం: రూపాయి ఖర్చు లేదు, ఏదీ కొనాల్సిన పనిలేదు. తల్లిదండ్రులకు భారం అసలే లేదు. కేవలం చదువుకోవడమే వారి పని. అదే చేసి చూపించి పది మంది మెచ్చుకునేలా ప్రతిభ చాటుకున్నారు స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు. నిరుపేద కుటుంబాలకు చెందిన వారంతా తమ పేదరికాన్ని చదువుతో జయించాలని మెరుగైన ఫలితాలు సాధించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణలు పాఠశాలల అభివృద్ధికి ఈ ఫలితాలు మచ్చుతునకలుగా నిలిచాయంటున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు. నాడు చేసిన అభివృద్ధి నేడు ఫలితాల రూపంలో కనిపిస్తోందంటున్నారు విద్యావేత్తలు. బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విశేష ప్రతిభ చూపి ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన ఫలితాలను సాధించారు. గొల్లప్రోలు బాలికోన్నత ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు తోట పుష్పాంజలి 594 మార్కులు, ఆకేటి కనకవల్లి 590 మార్కులు సాధించి కాకినాడ జిల్లాలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. పిఠాపురం బాదం మాధవరావు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎం శ్రీకీర్తన 587, జి.మహాలక్ష్మి 583, జి.సాయి సాహిత్య 577 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ఇదే పాఠశాలలో 28 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారు. కొత్తపల్లి మండలం యండపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యాళ్ల వెంకట శ్రావ్య సుధ , దడాల అక్షయ 586 మార్కులు సాధించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరచిన పది మందిలో ఐదుగురు పిఠాపురం నియోజకవర్గానికి చెందిన వారే కావడం విశేషం.

సామర్లకోట విద్యార్థుల ప్రతిభ

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు మంచి ప్రతిభతో ఉత్తమ ఫలితాలు సాధించారని ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు బుధవారం తెలిపారు. మండల పరిధిలో 16 ప్రభుత్వ పాఠశాలలో 75.22 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు వారు తెలిపారు. అయోధ్యరామపురం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 95 మంది పరీక్షలు రాయగా 77 మంది ఉత్తీర్ణులై 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ తెలిపారు. బి.తనుశ్రీ (585) మార్కులతో ప్రథమ, వై.అనూష (580), ద్వితీయ, ఎస్‌జెఎస్ఎస్ భార్గవ (576) మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 73 శాతం ఫలితాలు సాధించినట్టు హెచ్ఎం యు.మీనామాధురి తెలిపారు. బెజవాడ నాగ హారిక (582), కసిరెడ్డి గాయత్రి (574), జి.శ్రీవల్లి (556) మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారన్నారు. వారిని విద్యా కమిటీ చైర్మన్ పి.భవాని, వైస్ చైర్మన్ పచ్చాకుల లోవరాజు, హెచ్ఎం మీనామాధురి అభినందించారు.

ఓపెన్ స్కూల్‌లో..

స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లోని ఓపెన్‌స్కూల్ పదో తరగతి ఫలితాల్లో 74 మందికి 72 మంది పాసై 97 శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించారు. అదే విధంగా ఇంటర్మీడియెట్ పరీక్షలకు 41 మందికి 34 మంది పాసై 83 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మండల పరిధిలో..

పీబీ దేవం జెడ్పీ హైస్కూల్‌లో 58 మందికి 44 మంది పాసై 76శాతం ఉత్తీర్ణత సాధించారు. జి.మేడపాడు జెడ్పీ హైస్కూల్‌లో 79 మందికి 57 మంది, వేట్లపాలెంలో 118 మందికి 88 మంది, పవరలో 21 మందికి 17 మంది, చంద్రంపాలెం ఉప్పరగూడెంలో 41 మందికి 39 మంది, నవరలో 79 మందికి 74 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఉండూరులో 92 మందికి 77 మంది, వీకే రాయపురంలో 67 మందికి 55 మంది, మాధవపట్నంలో 50కి 45 మంది, సామర్లకోటలో 50 మందికి 23 మంది, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో 100 మందికి 68 మంది, గిరిజన ఆశ్రమ పాఠశాలలో 30 మందికి 22 మంది, బొడ్డు భాస్కరరామారావు మున్సిపల్ హైస్కూల్‌లో 34 మందికి 22 మంది, తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో 24 మందికి ముగ్గురు మాత్రమే పాస్ అయ్యారు. తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్ ఉత్తర్ణత శాతం తగ్గి పోవడానికి కారణాలపై మున్సిపల్ కమిషనర్ విచారణ చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు డిమాండ్ చేశారు. కాగ వేట్లపాలెం జిల్లా పరిషత్తు హైస్కూల్‌కు చెందిన రాయి భూయిల ప్రియాంక 582 మార్కులు సాధించిన్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం అనురాధ సాక్షికి తెలిపారు.

కొత్తపల్లిలో 75.43 శాతం ఉత్తీర్ణత

- ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలచిన యండపల్లి విద్యార్థులు
- ద్వితీయ స్థానంలో వాకతిప్ప విద్యార్థి



వై.ఎస్.వెంకటసుధ 586 యండపల్లి జిల్లా పరిషత్ పాఠశాల



దడాల అక్షయ 586 యండపల్లి జిల్లాపరిషత్ పాఠశాల



మోక మహాలక్ష్మీ 584 వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాల



అడబాల గీతా వరలక్ష్మి 580 యండపల్లి జిల్లా పరిషత్ పాఠశాల



ఈ. హరి 577 వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాల



ఎం.దీప్తి 574 కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాల



కదులిరి గౌరీ నిహారిక

కొత్తపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలం 75.43 ఉత్తీర్ణత శాతన్ని సాధించినట్లు ఎంఈఓ వేణుగోపాల్ బుధవారం తెలిపారు. 815 మంది పరీక్షలకు హాజరు కాగా 617 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వాకతిప్పలో 81 మందికి 66 మంది పాసై 81.5 శాతం, కొత్తపల్లి బాలికల పాఠశాలలో 139 మందికి 103 మంది పాసై 74 శాతం, కొత్తపల్లి బాలురు పాఠశాలలో 101 మంది విద్యార్థులకు 50 ఉత్తీర్ణులై 50 శాతం సాధించారు. కొమరగిరిలో 67 మందికి 66 మంది ఉత్తీర్ణులై 99 శాతం, కొండెవరంలో 112 మందికి 80మంది పాసై 71.42 శాతం, ఎండపల్లిలో 34 మందికి 32 మంది ఉత్తీర్ణులై 94 శాతం సాధించారు. అలాగే మూలపేటలో 132 మందికి 110 మంది పాసై 83 శాతం, కోనపాపపేట 77 మందికి 51 మంది పాసై 66 శాతం, రమణక్కపేటలో 20 మందికి 17 మంది పాసై 85 శాతం సాధించారు. నాగులాపల్లి తెలుగు మీడియం పాఠశాలలో 28మందికి 24 మంది పాసై 86 శాతం, ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 24 మందికి 18 మంది పాసై 75 శాతం సాధించారు. వీరిలో యండపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థి దడాల అక్షయ 586 మార్కులు, వైఎస్ వెంకటసుధ 586 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో, వాకతిప్ప జెడ్పీ పాఠశాల విద్యార్థి మోక మహాలక్ష్మి 584 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, యండపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన అడబాల గీతా వరలక్ష్మి 580 మార్కులు సాధించి తృతీయ సాధించారు. వాకతిప్ప జెడ్పీ పాఠశాలకు చెందిన ఈ.హరి 577, కొండెవరం జెడ్పీ పాఠశాలకు చెందిన ఎం.దీప్తి 574 మార్కులు సాధించారు.

576 మార్కులు సాధించిన నిహారిక

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి జెడ్పీ పాఠశాల విద్యార్థిని కదులిరి గౌరీ నిహారిక 576 మార్కులు మార్కులు పాధించారు.

పెద్దాపురంలో..



పట్టణ టాపర్ మనస్విని



మండలస్థాయి టాపర్ సుబ్రహ్మణ్యం



మండల స్థాయిలో రెండోస్థానం సాధించిన గణేష్

పెద్దాపురం: మండలం చంద్రమాంపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ద్వారంపూడి సుబ్రహ్మణ్యం 579 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు ఎంఈఓ ప్రభాకర శర్మ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో సుమారు 1610 మంది పరీక్షలు రాయగా 1245 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. మండలంలో 77.33 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తెలిపారు. పట్టణ టాపర్‌గా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థి బల్ల మనస్విని 566 మార్కులు సాధించగా చదలాడ హైస్కూల్‌కు చెందిన కుక్కులూరి గణేష్ 578 మండలస్థాయిలో రెండో ర్యాంకు సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.

గ్రామస్తులు సంయమనం పాటించాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



మల్లాంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వంగా గీత, వైఎస్సార్ సీపీ నేతలు

పిఠాపురం: మండలం మల్లాంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదంలో అందరూ సంయమనం పాటించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత కోరారు. బుధవారం ఆమె మల్లాంలో పర్యటించి ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సురేష్‌బాబు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కొన్ని విషయాలు బయటకి వచ్చాయని అటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకుని గ్రామస్తులు అన్నదమ్ములుగా కలిసి ఉండేలా చూడాలన్నారు. ఈ విషయాలు తెలిసిన వెంటనే జిల్లా అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని కోరగా అధికారులు శాంతికమిటీని ఏర్పాటు చేసి గ్రామాల్లో విద్వేషాలకు తావు లేకుండా సామరస్యంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున చేయూత నివ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, పిఠాపురం పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు రావుల మాధవరావు, అడపా రఘు, నాయకులు గండేపల్లి బాబీ, కొత్తెం దత్తుడు, ఉలవల భూషణం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయంపై దాడి శోచనీయం

డీఎస్పీ, ఆర్డీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేత



ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

పెద్దాపురం: ఏలూరు సాక్షి కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరుల దాడిని నిరశిస్తూ బుధవారం పెద్దాపురం పాత్రికేయులు శాంతియుత నిరసన చేపట్టారు. నియోజకవర్గ సీనియర్ జర్నలిస్టులు అడపా వెంకట్రావు, రాకుర్తి రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక డీఎస్పీ, ఆర్డీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు అరికట్టాలన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాక్షి పత్రికలో తమపై వ్యతిరేకంగా వార్త ప్రచురితమైందని కార్యాలయంపై దాడి చేయడం, ఫర్నీచర్ ధ్వంసం చేయడం దారుణమన్నారు. కథనంలో వాస్తవాలు లేకుంటే వివరణ ఇవ్వాలి తప్ప దాడులు సరికాదన్నారు. అనంతరం ఆయా కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పాత్రికేయులు పి.విజయ్, అడపా శ్రీను, ఆలీ, సుధాకర్, వినాయర్, శ్రీరామ్, పచ్చిపాల ప్రసాదరావు, పాశిలి ప్రసాద్, మున్నీ, పి.రాము, చింటూ, ఈశ్వరరావు, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

కుడ్య చిత్రాల కూనమ్మ!



పాఠశాల గోడలపై చిత్రాలు గీస్తున్న నెల్లి దుర్గ

పిఠాపురం: చదువుతో పాటు చిత్రాలపై మక్కువ పెంచుకున్న ఆ చిన్నారి కూన పాఠశాల గోడలపై బొమ్మలు వేసి పలువురి ప్రశంసలు పొందుతోంది. గొల్లప్రోలు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని నెల్లి దుర్గాస్రవంతి బొమ్మలు గీయడంలో నేర్పరి. తన కళ పాఠశాలకు ఉపయోగపడాలని తలచి పాఠశాల గోడలపై జాతీయ నాయకుల చిత్రాలతో నింపింది. తన తోటి విద్యార్థులు రామిశెట్టి సత్య, మొగలి ప్రణతి సహాయంతో తాను వేసిన చిత్రాలకు రంగులు అద్ది కనువిందు చేసింది. ఆమె కళా నైపుణ్యం చూసిన తోటి విద్యార్థులు ఉపాధ్యాయులు ఆమెను ప్రశంసిస్తున్నారు.

ఉగ్రదాడికి నిరసన



రావివారిపోడులో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ప్రజలు

కొత్తపల్లి: జమ్ము కాశ్మీర్‌లోని పెహల్‌గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ మండలంలోని పొన్నాడ శివారు రావివారిపోడులో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద నుంచి గ్రామంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పర్యాటకులపై దాడి చేయడం దారుణమన్నారు. ఇటువంటి దాడి హేయమైన పిరికిపందల చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబు తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



ఫైరింగ్ శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

పెద్దాపురం: స్థానిక జవహార్ నవోదయ విద్యాలయలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం వాలీబాల్, రైఫిల్ షూటింగ్ శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, క్యాంప్ కమాండెంట్ మేజర్ కె.మహ్మద్ హఫీజ్ మాట్లాడుతూ 18వ బెటాలియన్ కాకినాడ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తితో పాటు సమాజంలోని సమస్యలపై అవగాహన పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ హేమంత్‌కుమార్, లెఫ్టినెంట్ సత్యనారాయణ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కవోని దీక్షతో!



పాఠశాలకు మొక్కలు బహూకరిస్తున్న విద్యార్థులు

- చెట్టంత ఎదగాలని దీవించండి
- పాఠశాలకు మొక్కల బహూకరణ

పిఠాపురం: వారంతా మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుకుని ఇప్పుడు హైస్కూలు వెళ్తున్నారు. తరగతి మారుతున్న 30 మంది విద్యార్థులు 30 మొక్కలను పాఠశాలకు బహూకరించి తమను చెట్టంత ఎదగాలని దీవించమని ఉపాధ్యాయులను కోరి పలువురి ప్రశంసలందుకున్నారు. గొల్లప్రోలు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 6వ తరగతిలోకి వెళ్తూ ఒకొక్క మొక్క బహూకరించి తమకు పాఠశాలపై ఉన్న మమకారాన్ని తెలియజేసారు.

ఆటల కాలం..



ఆటలలో విద్యార్థులు

పిఠాపురం: ఇప్పటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు చదువులకు విరామం ప్రకటించి ఆటలకు ఉపక్రమించారు. వేసవి సెలవులు ప్రారంభం కావడంతో బుధవారం నుంచి ఆటపాటలతో గడపనున్నారు. ఎక్కడ చూసినా విద్యార్థులు ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా కనిపిస్తున్నారు. ఎండా కొండా లెక్క లేదంటూ చెట్టు, పుట్టా, పొలాలు అన్నీ వారికి వేసవి విడిదులయ్యాయి.